శ్రీకాకుళం

# సత్యమేవ జయతే

లోకేశ్వర్ దంపతులకి లేక లేక ఓ ఆడపిల్ల పుట్టింది! పిల్ల పువ్వులా వుంది. పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది కదా అని దగ్గరకెళ్ళి ఆఘ్రాణించారు. పరిమళం పొందలేక పోయారు. "ఓ వాసనలేని పువ్వు పుట్టింది" అన్నాడు తండ్రి. "వాసన లేకపోయినా పువ్వు పువ్వే" అంది తల్లి ప్రకృతి సిద్ధమైన మాతృవాత్యలంతో!

పిల్ల యుక్తవయస్సురాలయింది! పరిమళం ఎలాగూ లేదు సరికదా, పిల్లకి జ్ఞానం కూడా రాలేదు.

"ప్రసూనాంబా! నీకు జ్ఞానం లేదే!" అనేవాడు తండ్రి. తల్లి తన గారాలపట్టిని వెనకేసుకొస్తూ, "కొంతమందికి షష్టిపూర్తయినా జ్ఞానం రాదు. మన ప్రసూనకి యింకా పాతికేళ్ళు నిండలేదు.! దీనికి జ్ఞానం యింకా రాలేదని ఎందుకు తొందర పడుతున్నారు" అనేది.

ఈ జ్ఞానం విషయంలో ఏదో ఒకటి చేసి, మాట పడకుండా వుండాలని నిర్ణయించుకుంది ప్రసూనాంబ. తన పేరుకి ముందు 'జ్ఞాన' అని తగిల్చేసుకుని 'జ్ఞాన ప్రసూనాంబ'గా మారిపోయింది! కేవలం నామమాత్రంగా, జ్ఞానం లేకుండా యిటువంటి పనులు చేసేవారిని ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు!

ప్రసూనాంబకి పెళ్ళి సంబంధాలు తెస్తున్నారు గాని, ఏదీ కుదరలేదు. తన బావమరిది దగ్గరికి పంపిస్తే, వున్న వూరు మారిన వేళా విశేషంతో నయినా, పెళ్ళి కుదురుతుందేమోనని తన బావమరిది దగ్గరికి పంపించాడు లోకేశ్వర్.

ప్రసూనాంబకి వంట చెయ్యడం బాగా వచ్చనీ, కుట్లూ అల్లికలు బాగా వచ్చనీ ఊళ్లో పుకార్లు లేవ తీశాడు మేనమావ.

కుట్లు అల్లికలు అంటే యిష్టపడే ఓ సంబంధం వచ్చింది! పెళ్ళిచూపులు జరుగుతున్నాయి. పిల్లాడి తల్లి, 'స్వెట్టర్లు కూడా అల్లగలవా' అని అడిగింది.

"ఓ! ఒక్క స్వెట్టర్లేమిటి! కుచ్చుటోపీలు కూడా అల్లగలను" అంది ప్రసూనాంబ.

"ఉల్టా సీదా అంటే ఏమిటి" అని అడిగింది పిల్లాడి తల్లి.

"మీరడిగింది తెలీదు గాని, ఉల్టా పల్టా అంటే తెలుసు" అంది ప్రసూనాంబ.

"నీ దుంపతెగ! నన్నే పల్టీ కొట్టించడానికి ప్రయత్నిస్తున్నావా! నా పెళ్ళిచూపుల్లో నేనే చాలామందిని పల్టీలు కొట్టించాను" అని మొగుడికేసి చూస్తూ, "ఏమండీ! బెల్లంకొట్టిన రాయిలా ఏం మాట్లాడరేం!" అంది.

"అసలు పెళ్ళయిన తర్వాత నేనెప్పుడైనా మాట్లాడానా? అన్నాడు ఆ వెర్రిమొగుడు.

"పిల్లని లోపలికి తీసుకెళ్ళండి!" అంది పిల్లాడి తల్లి.

"నేనేం గుడ్డిదాన్ని కాదు. నేనే వెళ్ళగలను" అని నిశ్చయించింది ప్రసూనాంబ! ఆ సంబంధం అలా పోయింది!

"ఏం మావయ్యా! అన్ని పల్టీలు కొట్టించిన దాన్ని నేను పల్టీ కొట్టించడం గొప్పేకదా!"

"ఇలా అయితే చాలా కష్టం! వాళ్ళు అడిగిందానికి సమాధానాలు చెప్పాలి కాని నీ సొంత తెలివి ఎందుకు ఉపయోగిస్తున్నావ్" అన్నాడు మావయ్య.

"ఏమిటో! అస్తమానం జ్ఞానం లేదు అంటారు! నాకున్న జ్ఞాన ప్రదర్శన చేస్తే తప్పంటారు! అవునుగాని మావయ్యా! ఆ పల్టీలు కొట్టించిన పడతి మొగుడు, ఆమె పక్కన పిల్లిలా కూర్చున్నాడేమిటి!"

"అందరూ నాలా భార్య అంటే భయపడకుండా పులిలా వుంటారేమిటి!"

"మీ మావయ్య సర్కస్ పులి!" అంది అత్తయ్య.

"సర్కస్ పులి అంటే ఏమిటి అత్తయ్యా!"

"సర్కస్ పులి చెప్పినట్లు వింటుంది కదా! అదే సర్కస్ పులి అంటే!"

"ఒక్కసారి అందరూ ఆగండి!" అంటూ, ఈ సంబంధంతో కలిపి మొత్తం ఎన్ని తప్పిపోయాయో చూద్దామని, ప్రసూన తన వేళ్ళూ మేనమావ వేళ్ళూ లెక్కపెట్టి, "మొత్తం నలభై సంబంధాలు కుక్కముట్టుకు పోయాయ్" అంది.

"నీ లెక్క తప్పు! మొత్తం నలభై ఒకటి! మీ మావయ్య కుడిచేతి చిటికిన వేలు ప్రక్కన ఆరో వేలు వుంది, అది లెక్కపెట్టావ్‌గాని మామూలుగా ఎవరి చేతికైనా అయిదు వేళ్ళే వుంటాయ్ కదా అని..దాన్ని మొత్తం లెక్కలోకి తీసుకోలేదు!" అంది అత్తయ్య.

"అది సరే అత్తయ్యా! ఈ ఆరువేళ్ళు వున్న మా మావయ్య సంబంధం ఎలా ఒప్పుకున్నావ్ నువ్!"

"ఓ వేలు ఎక్కువ వుండడం వలన, మాకు కట్నంలో ఓ అయిదువేలు డిస్కౌంట్ వచ్చింది!"

"దాని మొహంలే! అసలు కుడిచేతికి ఆరోవేలు వుంటే చాలా సుఖం తెలుసా! పప్పు అన్నం తినేటప్పుడూ ఒక ముద్ద చెత్తో తీసుకుని, ఆరోవేలుతో పచ్చడి కూడా కొంచెం ఒకేసారి తీసుకుని నంచుకోవచ్చును తెలుసా!" అన్నాడు మావయ్య.

ప్రతీవాళ్ళూ రావడం, స్వీటూ, హాటూ తినడం, నానా రకాల ప్రశ్నలూ వెయ్యడం, తర్వాత పిల్ల నచ్చలేదనడం.! ఈ తతంగంతో విసిగిపోయింది ప్రసూన

నలభై రెండో సారి పెళ్ళి చూపులకి కూర్చోబెట్టారు ప్రసూనని.

తతంగం మొదలైంది! విసిగి వేసారి పోయిన ప్రసూనాంబని పిల్లాడి తల్లి తన ప్రశ్న పరంపరాభాగంలో, "ఏం చదువుకున్నావ్ అమ్మా!" అని అడిగింది.

ప్రసూనాంబకి పట్టలేని కోపం వచ్చింది! "ఏ వేదంబు పఠించె లూత.." అంటూ కాళహస్తీశ్వర శతకంలోని పద్యం అందుకుంది. "ఏమిటండీ! అందరూ 'చదువు' 'చదువు' అని నే పుట్టినప్పట్నుంచీ నన్ను తినేస్తున్నారు!" అసలు చదువంటే ఏమిటో చాలా మందికి తెలీదు. అంతవరకూ ఎందుకు "లూత" అంటే అర్థం తెలీదు. ధూర్జటి అంత గొప్పవాడు "సాలె పురుగు ఏం వేదాలు చదివిందని, దానికి మోక్షం లభించింది!" అని నిలదీశాడు. "చదువులయ్యా కావు" అని తేల్చి చెప్పాడు.

"మీరేమీ అనుకోకండి. నేను యదార్థవాదిని! ఇప్పటి వరకూ, మొన్ననే లెక్కవేశాం. నలభై ఒక్క సంబంధాలు కుదరలేదు. మీదికూడా పోతే నలభై రెండు అవుతాయ్! ఆడదానికి రావలసిన వంటా వార్పు నాకు వచ్చు! భర్తని ప్రేమగా చూసుకోగలను! ఆ పైన మీ యిష్టం" అని వాళ్ళు పిల్లని లోపలికి తీసుకెళ్ళమని చెప్పకుండానే తను లోపలి గదిలోకి వెళ్ళిపోయింది జ్ఞానప్రసూనాంబ!

"సరే! మేం వస్తామండీ!" అంటూ వాళ్ళు బయల్దేరారు! వాళ్ళని సాగనంపుతూ "మీ దర్శనం ఎప్పుడు చెయ్యమంటారు" అని, అడిగాడు మేనమామ.

'కో' అనబోయిన పిల్లాడి తండ్రి, "మీ బావగార్ని, అక్కగారిని ఓసారి రప్పించండి. వాళ్ళు వచ్చిన తర్వాత కలవండి!" అన్నాడు.

లోపలికి వచ్చిన మావయ్య తన భార్యతో, 'కో' అనబోయి మళ్ళీ తమాయించుకుని, మీ బావగార్నీ, అక్కగార్నీ రప్పించండి!" అన్నాడు! మరి అయన ఉద్దేశం ఏమిటో తెలియలేదు!

ఒకప్పుడు ఆయన "కో" "కో" ఆట ఆడేవారేమోనండి! "కో" "కో" ఆటకాదు, మనం తిన్నగా వుండకపోతే మనల్ని చెడుగుడు ఆడించేటట్లు వున్నాడు!"

"కోడలు అనబోయి, ముందే అలా అంటే కట్నంలో కొంత భాగం 'హుష్ కాకి' అయిపోతుందేమోనని, 'కో'తో సరిపెట్టాడేమో, మావయ్యా! "అసలు యిటువంటి పిల్లని ఎలా కన్నారని మా అమ్మనీ, నాన్ననీ చెడుగుడు ఆడించేస్తాడేమో!" అంది ప్రసూనాంబ.

పిల్లాడి తల్లిదండ్రులు, ప్రసూనాంబ తనకి నలభై ఒక్క సంబంధాలు తప్పిపోయాయని చెప్పినందువల్ల ఈమె సత్యసంధురాలని తెలుసుకుని సంతోషించారు. వాళ్ళ పెద్దకోడలు చెప్పే అబద్ధాలతో విసిగి వేసారిపోయి, కనీసం చిన్నకోడలయినా నిజం చెప్పేది అయితే కొంతవరకూ సుఖపడతామని, ప్రసూనాంబని తమ కోడలిగా తెచ్చుకోవడానికి నిర్ణయించుకున్నారు.

ప్రసూనాంబ తల్లిదండ్రులకి తమ నిర్ణయం తెలియజేశారు. ప్రసూనాంబ పెళ్ళి సంబంధం కుదిరినందుకు అందరూ సంతోషించారు.

నిశ్చయ తాంబూలాలనాడు, 'చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడ' అనే పాట జ్ఞాపకం

వచ్చిన ప్రసూనాంబ మేనమామ తన చెయ్యి పైకెత్తి "సత్యమేవ జయతే" అని అరుద్దామనుకున్నాడు కాని అతని చేతికి వున్న ఆరోవేలు కనిపిస్తే, తన భార్య తిడుతుందని ఊరుకున్నాడు.

శుభలేఖలో తన పేరు జ్ఞానప్రసూనాంబగా వేయించమని అడిగింది వధువు. "అత్తారింటికి వెళ్ళిన తర్వాత నీకు జ్ఞానం లేదన్న విషయం ఎలాగూ వాళ్ళకి తెలుస్తుంది. అప్పుడు నీ పేరులో అబద్ధం వుందని వాళ్ళకి తెలిస్తే బాగుండదు" అని వధువు పేరు 'ప్రసూనాంబ' అని అచ్చువేయించారు. ప్రసూనాంబకి తన కోరిక తీర్చలేదని కోపం వచ్చింది. "బాధపడకు! నువ్వు నిజం చెప్పడం వలన కుదిరిన సంబంధం కదా! అందుచేత నీ పేరులో 'జ్ఞాన' అనే అబద్ధం వుందని వాళ్ళకి తెలిస్తే, మన పరువుపోతుంది" అని చెప్పారు ప్రసూనాంబ తల్లిదండ్రులు.

"అరే! నాకీవిషయం తెలియలేదు!" అంది ప్రసూనాంబ.

"ఫర్వాలేదు! జ్ఞానం లేకపోతే యిటువంటి విషయాలు తెలియవ్" అన్నారు యింట్లో వాళ్ళు. మొత్తం మీద ప్రసూనాంబ పెళ్ళయి, అత్తారింటికి వెళ్ళింది!...

---

(రంజని దసరా దీపావళి 2012)

కథా నిలయం
శ్రీకాకుళం